క్లుప్తంగా

క్విజ్ పోటీల్లో నగరి విద్యార్థుల ప్రతిభ



జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

నగరి: జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో నగరి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం పలమనేరు జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాతపరీక్ష, క్విజ్ పోటీల్లో నగరి మున్సిపాలిటీ పుదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐశ్వర్య, మోహనప్రసాద్, బాలచందర్ అనే విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. గైడ్ టీచర్ శశిరేఖ ప్రత్యేక ప్రశంసలను అందుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు, గైడ్ టీచర్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

అంగన్‌వాడీ పోస్టుకు రూ.2 లక్షలు



ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్న చిన్నకలిగిరి సర్పంచ్ రమేష్

పెనుమూరు(కార్వేటి నగరం): జీడీనెల్లూరు నియోజకవర్గంలో అంగన్‌వాడీ పోస్టును రెండు లక్షలకు అమ్ముకున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. పెనుమూరు మండలంలోని చిన్నకలిగిరి అంగన్‌వాడీ పోస్టును టీడీపీ నాయకులు రూ.2 లక్షలు తీసుకొని ఓ సర్పంచ్‌కు కట్టబెట్టారు. ఇదేమిటని కొందరు ప్రశ్నించడంతో పరువుపోతుందని ఆ సర్పంచ్‌ని పిలిచి ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ కండువా వేసి సర్దుకున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



డోర్ మాట్స్ తయారీపై శిక్షణ ఇస్తున్న ట్రైనర్ శిరీష

పాలసముద్రం: మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రాణించాలని రూరల్ యాక్షన్ సంస్థ నిర్వాహకులు చిట్టిబాబు తెలిపారు. ఆదివారం ఆముదాల దళితవాడలో మహిళలకు డోర్ మాట్స్ తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిట్టిబాబు మాట్లాడుతూ డోర్ మాట్స్ ప్రాముఖ్యతను మహిళలకు వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఇలాంటి శిక్షణ ఎంతో అవసరమన్నారు. మార్కెట్‌లో డోర్‌మాట్స్‌కు అత్యంత డిమాండ్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్ శిరీష, రాజకుమారి, సరళ, రేఖ, ఉమ, శంకర్ పాల్గొన్నారు.

ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు



మాట్లాడుతున్న బాలకృష్ణ

తవణంపల్లె: ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలని ఇందులో ఇతరులకు ఏ మాత్రం సంబంధం ఉండదని హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ గ్రాండ్ మాస్టర్ బాలకృష్ణ, బెంగళూరుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ధానర్షి ప్రేమనాథ్ పేర్కొన్నారు. ఆదివారం కాణిపాకం సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న సేథ్ మహావిజ్ఞానం వర్క్ షాప్‌లో ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి 12 మంది సీనియర్ పిరమిడ్ మాస్టర్లు ఆత్మ జ్ఞానాన్ని అందించడానికి కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

గ్రామ చావడికి మోక్షం ఎప్పుడో?



కూలడానికి సిద్ధంగా ఉన్న గ్రామ చావడి

తవణంపల్లె: మండల కేంద్రంలో గ్రామ చావడి శిథిలావస్థకు చేరుకుంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన గ్రామ చావడి గోడలు బీటలు వారడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామ చావడిని తొలిగించాలని స్థానికులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు, పాలకులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ శిథిల భవనం పక్కనే ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు వస్తుంటారు. ఈ భవనం ఎప్పుడు కూలి ప్రమాదం సంభవిస్తోందని ఆందోళన చెందుతున్నారు. జిల్లా, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తీరేనా.. ఈ సమస్యలు

- జీసీ, దళితవాడలో సమస్యల తిష్ట
- నాలుగు నెలలుగా తాగునీటికి కటకట
- మరమ్మతులకు నోచుకోని మోటార్
- పట్టించుకోని అధికారులు



మరమ్మతులకు గురైన విద్యుత్ మోటార్

విజయపురం: కోసలనగరం బీసీ కాలనీ, దళితవాడలో సమస్యలు పేరుకుపోయాయి. ఇక్కడ సుమారు 70 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే వీరికి సరైన వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ మోటార్ మరమ్మతులకు గురై నాలుగు నెలలైనా అధికారులు పట్టించుకోలేదు. పంచాయతీకి వచ్చిన నిధులు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మురికి నీటి కాలువ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. అసలు ఇంత వరకు పూడికతీత పనులు చేపట్టలేదు. తాగునీటి కొళాయి విరిగిపోవడంతో గుంతల్లో దిగి నీటిని పట్టుకోవాల్సి దుస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు నెలలుగా తాగునీటికి ఇబ్బంది

కోసలనగరం దళితవాడలో విద్యుత్ మోటారు మరమ్మతులకు గురై నాలుగు నెలలైంది. ఇంత వరకు అధికారులు మరమ్మతు చేపట్టలేదు. దీంతో తాగునీటి కోసం మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే బీసీ కాలనీలో తాగునీటి కొళాయి పగిలిపోవడంతో గుంతల్లో దిగి నీరు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు కావస్తున్నా అధికారులు ఇంత వరకు ఈ గ్రామం వైపు కన్నెత్తి చూడలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అధికారులు అర్థం చేసుకోవాలి. ఎప్పుడూ అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ, వారు చెప్పిన పనులు చేస్తున్నారే తప్ప, ప్రజా సమస్యలను ఎవ్వరు పట్టించుకోవడం లేదు. మండల స్థాయి అధికారులు సైతం కార్యాలయం వదిలి ప్రజా సమస్యలను తెలుసుకోవడం లేదని, ఒక వేళ ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు.



పూడిపోయిన మురుగు కాలువ, గుంతలో తాగు నీరు పట్టుకుంటున్న మహిళ

బిక్కుబిక్కుమంటూ...

కోసలనగరం బస్టాండు నుంచి దళితవాడకు సుమారు అర కిలోమీటర్ ఉంది. రోడ్డుకు ఇరుపక్కలా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో విషసర్పాల సంచారం అధికంగా ఉందని, అత్యవసర పరిస్థితి, రాత్రి పూట ఆ రోడ్డు మార్గంలో వెళ్లాలంటేనే స్థానికులు భయపడుతున్నారు. అంతే కాకుండా దళిత ప్రజల నివాసాల చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఉన్నాయి. వాటిని శుభ్రం చేయాలని అధికారులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. అంతే కాకుండా పంచాయతీ అభివృద్ధి కోసం నిధులు ఏమైందో ప్రజలకు తెలపాలని కోరుతున్నారు.

చిన్నారికి ఆశీర్వాదం



చిన్నారిని ఆశీర్వదిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు పంచాయతీ బుచ్చిరెడ్డికండ్రిగ గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు దామోదర్‌రెడ్డి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడి బారసాలకి మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి హాజరై ఆశీర్వదించారు. ఆదివారం గ్రామంలో పర్యటించిన మాజీ మంత్రి నారాయణస్వామి దేవరాజరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ నాగరాణి, సర్పంచ్ గోవిందయ్య, ఎంపీటీసీ భాస్కర్, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు రామయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, యువత మండల అధ్యక్షుడు గణపతిరెడ్డి, నాయకులు శివాజీ, ధనుంజయరెడ్డి, రామచంద్రారెడ్డి, దామోదర్‌రెడ్డి ఉన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం



నూతన అధ్యక్షుడు రాజేంద్ర

గంగాధరనెల్లూరు: మండల యూటీఎఫ్ సర్వసభ్య సమావేశం ఆదివారం జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్థసారధి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధరనెల్లూరు మండల నూతన యూటీఎఫ్ శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పి.కేశవన్, అధ్యక్షుడిగా యం.రాజేంద్రన్, ప్రధాన కార్యదర్శిగా ఎ.మునిక్రిష్టారెడ్డి, కోశాధికారిగా భానుప్రకాష్, అసోసియేట్ అధ్యక్షులుగా శాంతి, విజయనాయుడు, మండల కార్యదర్శులుగా బాబూజీ, రంజిత్ కుమార్, కేవీ.శైలజ, సుధ, టెన్నీసన్, శ్రీధర్, దాము, అల్లీ రాణి, జిల్లా కౌన్సిలర్లుగా గణేష్ కుమార్, సుబాషిణి, వేలు, ఉమాపతి ఎన్నికైనట్లు ప్రకటించారు. ఎన్నికైన వారికి జిల్లా ప్రధాన కార్యదర్శి మణికంఠ, కార్యదర్శులు దీనావతి, బాషాతోపాటు సుబ్బరాయ పిళ్లై, సాధనా కుమార్, బాబు తదితరులు అభినందనలు తెలియజేశారు.

కళ కళలాడుతున్న కంది పంట



టీఎస్.అగ్రహారంలో కళకళలాడుతున్న కంది పంట

ఐరాల: మండల వ్యాప్తంగా ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు పడకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. మధ్యలో అక్కడక్కడ కొంతమేర అరకొరగా కురిసిన వర్షాలకు చాలామంది రైతులు వివిధ పంటలు సాగు చేశారు. అయితే వర్షం పడకపోవడంతో సాగైన పంటలు వాడుముఖం పట్టి, ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సీజన్ చివరి దశలో మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో పంటలు కళ కళలాడుతున్నాయి. మండంలలో 15 హెక్టార్లల్లో రైతులు కంది పంట సాగు చేశారు. మూడు, నాలుగు రోజులుగా వర్షం తెరిపిచ్చింది. అన్ని పంటలు జీవం పోసుకున్నాయి. ఇందులో కంది పంట కళకళలాడుతున్నాయి. ఎటు చూసినా పచ్చదనమే కనిపిస్తోంది. అయితే అధిక వర్షం కారణంగా కొన్నిచోట్ల వరి పంట బాగా దెబ్బతిన్న పరిస్థితి నెలకొంది. లోతట్టు పొలాల్లో పంటలు బాగా దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు.

మోక్షానికి మార్గం భగవద్గీత పారాయణం



త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేస్తున్న సభ్యులు

బంగారుపాళెం: భగవద్గీత పారాయణం మానవునికి మోక్షమార్గమని బంగారుపాళెం ప్రబోధ సేవాసమితి నిర్వాహకులు బాలాజీ, ధనుంజయ అన్నారు. ఆదివారం రాగిమానుపెంట గ్రామం, దళితవాడలో ప్రబోధ సేవా సమితి సభ్యులు త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై ప్రచారం చేశారు. కమిటీ సభ్యులు మునిరత్నం, లోకనాథ్, లలిత, కిరణ్, విమలమ్మ, మంజుల, చిట్టెమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి

– యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చిత్తూరు కలెక్టరేట్: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు ఆదివారం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన వేతన కమిటీని నియమించాలన్నారు. 33 శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ను వెంటనే ప్రకటించాలన్నారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రకటించాల్సిన కరువు భత్యం(డీఏ) ప్రకటించాలని కోరారు. నవంబర్ 3, 4 తేదీల్లో పూతలపట్టులో జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేసేందుకు టీచర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్, నాయకులు ప్రసన్నకుమార్, రఘుపతిరెడ్డి, రెహాన బేగం, ఏకాంబరం, పార్థసారధి పాల్గొన్నారు.

కూటమి నేతల అక్రమ క్వారీల దందా

అధికారం అండతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. దౌర్జన్యాలు, దాడులు, వేధింపులకు దిగుతున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో అనుమతి పొందిన క్వారీలను సైతం దౌర్జన్యంగా ఆక్రమించుకుని నిర్వహిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. అంతటితో ఆగక ఎన్నో ఏళ్ల నుంచి నిజాయితీగా క్వారీలను నడుపుతున్న వారిపై వేధింపులకు దిగుతున్నారు. తమకు కమీషన్ ఇవ్వకుంటే క్వారీలను నిలిపేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలిపినా ఫలితం లేదని బాధితులు లబోదిబోమంటున్నారు.

- చెలరేగిపోతున్న కూటమి నాయకులు
- క్వారీలను మూసివేస్తున్న యజమానులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



పట్టా భూమిలో అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీ


సాక్షి టాస్క్‌ఫోర్స్: గంగాధరనెల్లూరు నియోజకవర్గం శ్రీరంగరాజపురంలో అనుమతి పొందిన క్వారీలు సుమారు 39 వరకు నడుస్తున్నాయి. ఎక్కడా ఉల్లంఘనలకు పాల్పడినట్టు ఫిర్యాదులు వెల్లువెత్తలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వచ్చాక వాటిపై కూటమి నేతల కన్ను పడింది. క్వారీల నిర్వాహకులపై వేధింపులకు దిగారు. కమీషన్ ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేశారు. 'ఇది మా ప్రభుత్వం మేం ఏది చెబితే అది వినాలి.. లేదా.. మాకు వాటా అందాలి.. లేకుంటే క్వారీలను సీజ్ చేయిస్తాం' అంటూ బెదిరింపులకు దిగారు. వారికి కమీషన్ ఇవ్వలేక 29 క్వారీలను నిర్వాహకులు మూసేశారు. ప్రస్తుతం 10 క్వారీలు మాత్రమే నడుస్తున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే మిగిలిన క్వారీలను కూడా మూసివేయాల్సిందేనని యాజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టా భూమిలో అక్రమ క్వారీ

శ్రీరంగరాజపురం మండలంలోని పిల్లిగుండ్లపల్లికి చెందిన గుణశేఖర్‌నాయుడు భార్య మోహనమ్మ పేరు మీద ప్రభుత్వం 1992లో 55 పద్మాపురం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 165/1లో 4.90 ఎకరాలకు డీకేటీ పట్టా ఇచ్చింది. అందులో క్వారీ నిర్వహించుకునేందుకు 2012లో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. అనుమతులు ఆలస్యం కావడంతో మిన్నకుండిపోయారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ భూముల్లోని క్వారీపై టీడీపీ నేతల కన్ను పడింది. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రధాన అనుచరుడు శేఖర్‌బాబు ఆ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే గుణశేఖర్‌నాయుడు భార్య మోహనమ్మ పేరు మీద పట్టా ఉన్న భూమిలో అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్నాడు. దీనిపై బాధితులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినా ఫలితం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు న్యాయం చేయాలని, లేకుంటే కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకుంటామని చెబుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారుల వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



బాధితుడు గుణశేఖర్‌నాయుడు



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్టు ఇచ్చిన అర్జీ రశీదు, పి.మోహనమ్మ పేరుపై ప్రభుత్వం ఇచ్చిన డీ ఫాం పట్టా, క్వారీ అనుమతుల కోసం పి.మోహనమ్మ చేసుకున్న దరఖాస్తు

ధ్వని కాలుష్యం నివారించండి



బైక్‌కు అమర్చిన వింత సైలెన్సర్లు

విజయపురం: వాహనాల ధ్వని కాలుష్యం నానాటికీ మితిమీరుతోంది. ప్రత్యేకించి 'బుల్లెట్' బైక్ పునరాగమనం తరువాత ఈ సమస్య మరింత ఎక్కువైంది. అందరూ గాఢనిద్రలో ఉండే అర్ధరాత్రి సమయంలో ప్రశాంతతను భగ్నం చేస్తూ బైకులు వీరవిహారం చేస్తున్నాయి. ఆ బైకులతో వచ్చే ఒరిజినల్ సైలెన్సర్లను తీసివేసి, విచిత్ర శబ్దాలు చేసే ప్రత్యేక సైలెన్సర్లు బిగించి, వింత శబ్దాలు సృష్టిస్తున్నారు. వాహన ధ్వని కాలుష్య నియంత్రణ చట్టాలు ఉన్నా సంబంధిత అధికారులు వాటిని అమలుచేయడం లేదు. సెక్షన్ 190(2), 1988 మోటారు వాహనాల చట్టం ప్రకారం బైకులతో వచ్చే సైలెన్సర్లను, హారన్లను మార్చడం నిషేధం. ధ్వని కాలుష్యాన్ని పరిమితుల్లో ఉంచడానికి అవసరమైన ఇతర నిబంధనలు ఆ చట్టంలో ఉన్నాయి. బైకులపై వెనుక కూర్చునేవారు కూడా హెల్మెట్ ధరించాలంటూ నిబంధనలు అమలు చేస్తున్న పోలీసు యంత్రాంగం ధ్వని కాలుష్య నియంత్రణ చట్టాలపై కూడా దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పసిపిల్లలు, వృద్ధులు, రోగులు, ఇతర ప్రజానీకం కూడా ఈ బైకుల ధ్వని కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే విపరీతమైన ఒత్తిడితో నిండిన జీవనం, ఈ బైకువీరుల ఆగడాలతో మరింత జటిలమవుతున్నది. ఇప్పటికైనా ఈ సమస్యపై దృష్టి పెట్టి, ధ్వని కాలుష్య నియంత్రణకు వీరిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

ఆయమ్మల రాష్ట్ర సభలకు తరలిరండి



ఆయమ్మల ఐక్య ప్రదర్శన

గంగాధరనెల్లూరు: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ పాఠశాలల ఆయమ్మల జిల్లా ముఖ్యుల సమావేశం ఎస్.జయకుమారి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.నాగరాజు ప్రభుత్వ పాఠశాల ఆయమ్మల వర్కర్స్ యూనియన్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జయకుమారి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయమ్మల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా విమర్శించారు. ఆయమ్మలకు ప్రభుత్వం జీతాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. రాజకీయ వేధింపులను అరికట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆయమ్మల వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభలు విజయవాడ ఏలూరులో నవంబరు నెల 10వ తేదీన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మహాసభకు జిల్లా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయమ్మలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో దాసరి చంద్ర, రమాదేవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న వ్యవస్థాపకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): న్యూట్రిన్ గ్రూప్ వ్యవస్థాపకులు ద్వారకనాథరెడ్డి శత జయంతిని పురస్కరించుకుని చిత్తూరులోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ద్వారకనాథరెడ్డి రమణార్పణం ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాలకు చెందిన 700 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాన్ని ప్రతిబింబించే వ్యాసరచన కథ పోటీలను నిర్వహించారు. డ్రిక్ పాఠశాల ట్రస్టీ పద్మశ్రీ అనితారెడ్డి మాట్లాడుతూ ద్వారకనాథ్ రెడ్డి స్ఫూర్తితో పేద పిల్లలను ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉన్నత విద్యను చదివిస్తున్నట్లు పేర్కొన్నారు.

డీఈఓను కలసిన సంఘాల నేతలు



డీఈఓను కలిసిన ఎస్టీయూ నేతలు, డీఈఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈఓ వరలక్ష్మిని జిల్లాలోని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిశారు. మర్యాదపూర్వకంగా డీఈఓను కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సంఘ నాయకులతో డీఈఓ మాట్లాడుతూ విద్యాపరంగా జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేందుకు అందరం సమష్టిగా కలసి కృషి చేయాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన, నాణ్యమైన ఫలితాల సాధనకు ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాశాఖకు సంబంధించి ఏలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వీలైనంత త్వరలో సంఘాల నాయకులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. డీఈఓ ను ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్ మోహన్‌రెడ్డి, బోడె మోహన్, నాయకులు శ్రీదేవి, మునెప్ప, పురుషోత్తం, దేవరాజులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. నవంబర్ 3,4 తేదీల్లో పూతలపట్టులో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు హాజరుకావాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, నాయకులు సుధాకర్‌రెడ్డి, మునిరత్నం, రెహనాబేగం పాల్గొన్నారు. నోబుల్ టీచర్స్ అసోషియేషన్ నుంచి జిల్లా అధ్యక్షులు జయప్రకాష్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి రామయ్య, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షులు దేవకి, ప్రధాన కార్యదర్శి రుక్మాంద, నాయకులు నిరంజన్‌రెడ్డి, హరిప్రసాద్ పాల్గొని డీఈఓకు పుష్పగుచ్ఛం అందజేశారు.

బోయకొండకు వాల్మీకుల పాదయాత్ర



బోయకొండకు పాదయాత్రగా వెళ్లిన వాల్మీకి కుల సంఘ నాయకులు

పుంగనూరు: వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని, బోయకొండ చైర్మన్ పదవి వాల్మీకులకు ఇవ్వాలని ఆ కుల సంఘ నాయకులు ఆదివారం బోయకొండకు పాదయాత్ర చేశారు. పట్టణంలోని పూలే విగ్రహానికి ఆ కుల సంఘ నాయకులు శ్రీనివాసులు, అద్దాల నాగరాజ ఆధ్వర్యంలో వాల్మీకి కులస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాల్మీకుల సమస్యల పరిష్కారం కోసం బోయకొండకు పాదయాత్రగా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

వర్షం..వరి రైతుకు నష్టం



మిట్టపల్లె వద్ద నేలకొరిగిన వరి పంట

బైరెడ్డిపల్లె: ఇటీవల కురిసిన వర్షాలకు వరి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రధానంగా వరి ప్రస్తుతం పొట్టదశలో పైరు పూర్తిగా నేలకొరిగి 60 శాతం వరకు దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. గతేడాది వరి పంటకు గిట్టుబాటు ధర పలకడంతో ఈసారి చాలా మంది రైతులు అధికంగా వరి సాగు చేశారు. పొట్టదశలో ఉన్న వరి పంట నవంబర్ రెండో వారంలో చేతికి వస్తుందన్న తరుణంలో వర్షం వల్ల పంట చాలా వరకు నేలకొరగడంతో దిగుబడి ఎకరాకు 10 బస్తాల వరకు తగ్గుతుందని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెప్పారు. దీంతో పాటు టమాట పంటకు పూర్తిగా నష్టం వాటిల్లి తెగుళ్ల ఆశించాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.